క్లుప్తంగా

క్యాలెండర్ ఆవిష్కరణ



చండూర్ రామలింగేశ్వర స్వామి ఆలయంలో క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న గ్రామస్తులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని చండూర్ గ్రామంలోని రామలింగేశ్వర స్వామి ఆలయ ఆవరణలో బుధవారం దేవాలయ క్యాలెండర్ ఆవిష్కరించారు. ఆలయ కమిటీ మాజీ చైర్మన్ సాయిరెడ్డి గారి వెంకట్‌రెడ్డి, భజన భక్తుల ఆధ్వర్యంలో క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామానికి చెందిన తలారి నర్సింలు తన సొంత నిధులతో చండూర్ గ్రామవాసుల పేర్లు వచ్చేలా క్యాలెండర్ ముద్రించారన్నారు. నర్సింలు ఆధ్యాత్మిక చింతనతో పాటు, సామాజిక సేవలో ముందుండడం హర్షనీయమన్నారు. ఈ కార్యక్రమంలో శివస్వాములు,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పాల పంపిణీ



పాలను పంపిణీ చేస్తున్న సిబ్బంది

మెదక్‌జోన్: ప్రముఖ భారతీ సిమెంట్ కంపెనీ ఆధ్వర్యంలో క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం మెదక్ చర్చి వద్ద తెల్లవారు జామునుంచి భక్తులకు పాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిబ్బంది మల్లారెడ్డి, కొండల్‌రెడ్డి, సతీష్‌కుమార్, సునీల్, లింగమూర్తి, నర్సింలు, కృష్ణకాంత్ పాల్గొన్నారు.

అయ్యప్ప మహాపడిపూజ



అయ్యప్ప పడిపూజలో భక్తులు

పెద్దశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలో బుధవారం అయ్యప్ప మహాపడిపూజ వైభవంగా నిర్వహించారు. గురుస్వామి రామచంద్రాచారి ఆధ్వర్యంలో ప్రవీణ్‌గౌడ్ స్వామి నివాసంలో నిర్వహించిన పడిపూజలో భక్తులు పాల్గొని స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. 18 పడిమెట్లకు పూజలు, పుష్పాభిషేకం చేశారు. ఈ సందర్భంగా భక్తులు పాడిన భజనలు, కీర్తనలు అందరిని ఆకట్టుకున్నాయి.

విద్యార్థులకు క్రీడా పరికరాలు



ఆట వస్తువులు అందిస్తున్న సభ్యులు

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని ఖాజాపూర్‌తండాలో కలాం ఫ్రీ ట్యూషన్ సెంటర్ విద్యార్థులకు సానీక్ష ఫౌండేషన్, స్వామినాయక్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆట వస్తువులు అందించారు. ఈ సందర్భంగా చిన్నారులకు క్యారం బోర్డులు, చేస్‌బోర్డులు, స్కిప్పింగ్ తాడులు, నోట్‌బుక్స్‌ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ శివ, రమేష్‌నాయక్, స్వరూప, చరణ్‌నాయక్, వరుణ్‌నాయక్ పాల్గొన్నారు.

రహదారికి మరమ్మతులు



జేసీబీతో చదును చేస్తున్న సిబ్బంది

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని రంగంపేట గుండ ఆశ్రమానికి కలుపుతూ ఉన్న రహదారి అధ్వానంగా మారి పాపన్నపేట వైపు వెళ్లే ప్రయాణికులకు ఇబ్బందికరంగా తయారైంది. ఎమ్మెల్యే సునీతారెడ్డి ఆదేశాలతో సొంత నిధులతో బుధవారం డీసీఎంఎస్ వైస్ చైర్మన్ రమేశ్‌కుమార్ గుంతలమయంగా మారిన రహదారిని జేసీబీతో చదును చేయించడంతో పాటు అవసరమైన చోట్ల మట్టిని పోయించి రవాణాకు అనుకూలంగా తీర్చిదిద్దారు.



నర్సాపూర్ రూరల్: నాగులపల్లి చర్చిలో ప్రార్థనలు చేస్తున్న భక్తులు



నర్సాపూర్ సీఎస్ఐ చర్చిలో కేక్ కట్ చేస్తున్న దృశ్యం



శివ్వంపేట(నర్సాపూర్): మగ్దుంపూర్ ఆశ్రమంలో క్రిస్మస్ వేడుకలు



చిలప్‌చెడ్(నర్సాపూర్): చిట్కుల్‌లో..



వెల్దుర్తి(తూప్రాన్): ఆరెగూడెంలో..



కొల్చారంలో..



రామాయపేట(మెదక్): లక్ష్మాపూర్‌లో..



చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండల కేంద్రంలో..



పెద్దశంకరంపేట సీఎస్ఐ చర్చిలో ప్రార్థలు చేస్తున్న క్రైస్తవులు



మనోహరాబాద్(తూప్రాన్): కాళ్లకల్‌లో..



కౌడిపల్లి సీఎస్ఐ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

జిల్లాలో బుధవారం క్రిస్మస్ పర్వదినాన్ని ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కేక్‌లు కట్ చేసి, ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

అమ్మవారి దర్శనం అడ్డుకుంటారా?

- పోలీసులపై భక్తుల ఆగ్రహం
- రెండు గంటలపాటు అవస్థలు పడ్డ భక్తులు
- సీఎం పర్యటనతో.. అమ్మవారి దర్శనం నిలిపివేత



ఏడుపాయల్లో పోలీసులతో వాగ్వాదం చేస్తున్న భక్తులు



అమ్మవారి దర్శనానికి వేచి చూస్తున్న భక్తులు

మెదక్ కలెక్టరేట్: సీఎం వస్తే మేం అమ్మవారిని దర్శించుకోవద్దా? మమ్మల్ని ఎందుకు అడ్డుకుంటున్నారు అంటూ దుర్గమ్మ భక్తులు ఏడుపాయల్లో పోలీసులతో వాగ్వాదానికి దిగారు. బుధవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఏడుపాయలకు వస్తున్న సందర్భంగా సాధారణ భక్తులను ఆలయంలోకి అనుమతించలేదు. భక్తులను దర్శనానికి వెళ్లకుండా సుమారు అర కిలో మీటర్ దూరంలోనే రెండు గంటలపాటు నిలిపివేశారు. భారీ కేడ్లు పెట్టి సీఎం వచ్చి వెళ్లే వరకు ఎలాంటి అనుమతులు లేవని చెప్పడంతో ఆసహానికి గురైన భక్తులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. నిజామాబాద్, హైదరాబాద్ ప్రాంతాల నుంచి అమ్మవారి దర్శనానికి వస్తే అడ్డుకుంటారా.. అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి వచ్చి వెళ్లే వరకు మేం అమ్మవారిని దర్శించుకోకూడదా? అంటూ మండిపడ్డారు. సీఎం కోసం భక్తులను ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు. మధ్యాహ్నం 12.15గంటలకు ముఖ్యమంత్రి హెలిక్యాప్టర్ ద్వారా ఏడుపాయలకు చేరుకున్నారు. కానీ ఉదయం 11 గంటల నుంచే భక్తుల దర్శనం నిలిపివేశారు. సీఎం రేవంత్‌రెడ్డి అమ్మవారి దర్శనం చేసుకొని మధ్యాహ్నం 1 గంటకు తిరిగి వెళ్లగా.. అనంతరం భక్తులను అమ్మవారి దర్శనానికి అనుమతించారు. ఏడుపాయల రాజగోపురం సమీపంలోని దుకాణాలను మూయించి భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. పాస్‌లు ఉన్న వారి తప్ప... వరికి లోపలికి అనుమతించలేదు. పెద్ద ఎత్తున భారీ కేడ్లు ఏర్పాటు చేసి వాటిని దాటి ఎవరు రాకుండా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో సీఎంను చూసేందుకు వచ్చిన కాంగ్రెస్ కార్యకర్తలు, మహిళలు ఇబ్బందులకు గురయ్యారు.

సీఎం ఏడుపాయల పర్యటన సాగిందిలా..



ముఖ్యమంత్రికి దుర్గాభవాని చిత్రపటాన్ని బహూకరిస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రావు

పాపన్నపేట(మెదక్): ఉదయం 11 గంటలకు ఏడుపాయల రావాల్సిన ముఖ్యమంత్రి మధ్యాహ్నం 12.20 నిమిషాలకు హెలీక్యాప్టర్‌లో ఘనపురం టేకుల గడ్డ ప్రాంతానికి చేరుకున్నారు.

- అక్కడి నుంచి కారులో 12.31 వరకు యాగశాల ప్రాంతానికి వచ్చారు.
- 12.32కు కారు దిగగానే ప్రముఖులు, అధికారులు, వేద బ్రహ్మణులు ఆలయ మర్యాదల ప్రకారం స్వాగతం పలికారు.
- 12.36కు దుర్గమ్మ ఆలయంలోనికి ప్రవేశించారు.
- 12.50 వరకు వన దుర్గమ్మకు వేద బ్రహ్మణులు పూజలు చేసి, ముఖ్యమంత్రికి తీర్థ ప్రసాదాలు అందజేశారు.
- 12.50 నుంచి 1.00 గంట వరకు ఆలయ మంటపంలో సీఎంకు, మంత్రులకు దేవాలయ అర్చకులు వేద మంత్రాలతో ఆశీర్వదించారు. అధికారులు, మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ సీఎంకు దుర్గమ్మ, చిత్రపటాన్ని అందజేశారు.
- 1.00 గంటకు వివిధ అభివృద్ధి పనులకు శంఖు స్థాపనలు చేశారు.
- 1.02 నిమిషాలకు రాజగోపురం వరకు కార్యకర్తలకు, నాయకులకు అభివాదం చేస్తూ ముందుకు కదిలారు.
- 1.05 నిమిషాలకు కారులో ఎక్కి, కాన్వాయ్‌తో మెదక్ బయలు దేరారు.

ముందస్తు జాగ్రత్తలు పాటించాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న అగ్రికల్చర్ విద్యార్థులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): వ్యవసాయ సమాచారం తెలిస్తే పంటసాగులో రైతులు సరైన జాగ్రత్తలు పాటిస్తాడని మల్లారెడ్డి యూనివర్సిటీ వ్యవసాయ విద్యార్థులు అన్నారు. గ్రామీణ కృషి అనుభవంలో భాగంగా బుధవారం వారు కేవీకే శాస్త్రవేత్త డా.రవి కుమార్ ఆధ్వర్యంలో మండలంలోని శీలాంపల్లి గ్రామంలో గ్రామీణ విశ్లేషణాత్మక సదస్సు నిర్వహించారు. గ్రామం, నేలలు, పంటలసాగు, రైతు వాడిన ఎరువులు తదితర వాటి మ్యాప్ వేసి, రైతులకు గ్రామస్థితి గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పంటసాగులో వస్తున్న నూతన పద్ధతులను ముందుగానే రైతులకు తెలియజేస్తామన్నారు. రైతులు సాగు చేస్తున్న పంటలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పంటలకు వచ్చే వ్యాధులు, చీడపీడల గురించి ముందుగానే తెలుసుకోవడం వంటి సూచనలు ఇస్తామన్నారు. రైతులకు అర్థమయ్యేలా సమాచారాన్ని చార్ట్‌లు, పోస్టర్ల రూపంలో అవగాహన కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ విద్యార్థులు అభినయ, రమ్య, రోహిత, శమభాను, సాయిప్రసన్న, రైతులు పాల్గొన్నారు.

వాజ్‌పేయి అడుగుజాడల్లో నడవాలి



నర్సాపూర్‌లో వాజ్‌పేయి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న బీజేపీ నాయకులు



పెద్దశంకరంపేటలో ..



చేగుంటలో..

నర్సాపూర్: దేశ మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేశ్‌గౌడ్, పార్టీ నాయకులు రాజేందర్, నగేష్, ఆంజనేయులుగౌడ్ పాల్గొన్నారు.

పెద్దశంకరంపేటలో..

పెద్దశంకరంపేట(మెదక్): దివంగత మాజీ ప్రధాన మంత్రి అటల్‌బీహారీ వాజ్‌పేయి జయంతి వేడుకలను మండల బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి మండలాధ్యక్షుడు విఠల్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ.. వాజ్‌పేయి అడుగుజాడల్లో నాడవాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రావణ్, కృష్ణ తదితరులు ఉన్నారు.

చేగుంటలో..


చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం చేగుంట గాంధీ చౌరస్తా వద్ద మాజీ ప్రధాని వాజ్‌పేయి జయంతిని బీజేపీ నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ చౌరస్తా వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి

దుబ్బాక: దుబ్బాక మున్సిపాలిటీని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్లు చైర్‌పర్సన్ గన్నె వనిత భూంరెడ్డి అన్నారు. మున్సిపల్ పరిధిలోని దుంపలపల్లి వార్డు శివారులో మున్సిపల్ వెల్‌కమ్ ఆర్చ్‌ను బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఇల్లందుల శ్రీనివాస్, కమిషనర్ కల్యాణం రమేశ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

కంకర రోడ్లపై ప్రయాణించేదెలా ?

- అవస్థలు పడుతున్న ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు





నిజాంపేట నుంచి నస్కల్‌కు వెళ్లే కంకర రహదారి

నిజాంపేట (మెదక్): గ్రామాల్లోని రోడ్లపై ప్రయాణించాలంటే ప్రజలు జంకుతున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయాందోళన వ్యక్తంచేస్తున్నారు. మండల పరిధిలోని నస్కల్, నందగోకుల్, రాంపూర్, నగరం, చల్మెడ గ్రామాల మీదుగా 12 కి.మీలకు రెండేళ్ల క్రితం మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి బీటీరోడ్డు నిర్మాణానికి రూ. 18 కోట్లు నిధులు మంజూరు చేశారు. ఈ పనులను కాంట్రాక్టర్ శిథిలావస్థలో ఉన్న రోడ్డును తొలగించి రోడ్డు పనులు ప్రారంభించారు. కానీ రోడ్డు కంకర వేసి వదిలేశారు. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ జాతీయ రహదారి నుంచి పలు గ్రామాలకు కంకర వేసి వదిలేశారు. రెండేళ్లు పూర్తి అవుతున్నా.. పనులు ప్రారంభం కాలేదు. ఈ సమస్యతో వాహనాలు వెళ్తున్నప్పుడు దుమ్ము, ధూళి కళ్లలో పడి ఇబ్బందిగా మారింది. అలాగే మండలానికి చెందిన పలు గ్రామాలతో పాటు సరిహద్దు జిల్లా అయిన కామారెడ్డి, సిరిసిల్ల, వేములవాడ వెళ్లడానికి ఇదే ప్రధాన రహదారి కావడంతో ఈ రోడ్డు మరింత సమస్యగా మారింది. ఈ రోడ్డులో తిరిగి ద్విచక్ర వాహనారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రతీసారి ఎన్నికలు వస్తున్నాయంటే ప్రతీ నాయకుడు మెదక్ జిల్లాకు ఈశాన్యంలో ఉన్న రాంపూర్ గ్రామంలోని హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసి, ప్రచారం చేస్తుంటారు. కానీ ఈ గ్రామానికి వెళ్లడానికి వెళ్లే రహదారి మాత్రం ఎవ్వరు పట్టించుకోవడం లేదని ప్రజలు వాహనదారులు ఆవేదన చెందుతున్నారు. రోడ్లు సరిగా లేక చాలా మంది విద్యార్థులు వాహన సదుపాయం లేక చదువును మధ్యలోనే ఆపేస్తున్నారు.

పనులు చేపట్టాలి



రోడ్డును వేస్తామంటూ ఉన్న రోడ్డును కాస్త తవ్వేశారు. ఏళ్ల గడుస్తున్నా పనులు ప్రారంభం కావడం లేదు. దీంతో ప్రయాణం చాలా ఇబ్బందిగా ఉంది. ఈ దారిలో ఎప్పుడు వాహనాలు తిరుగుతుంటాయి. 4 గ్రామాల నుంచి విద్యార్థులు ఉన్నత చదువులు వెళ్లలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం.

– రవి, నస్కల్

వెళ్లలేకపోతున్నాం..



రోడ్డు వేస్తామని ఉన్న రోడ్డును తవ్వి కంకర వేసి, తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారు. కంకర వేసిన రోడ్డులో ప్రయాణిస్తుంటే దుమ్ము, ధూళి గాలిలో కలిసి కంటిలో పడి వెళ్లలేకపోతున్నాం. కళ్లలో దుమ్ముపడి తరచు ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు ప్రారంభించాలి.

– పాతూరి అంజాగౌడ్, నస్కల్

బస్సు చార్జీలపై కంట్రోలర్‌తో గొడవ



నర్సాపూర్ బస్టాండ్‌లో కంట్రోలర్‌తో వాగ్వాదం చేస్తున్న ప్రయాణికులు

నర్సాపూర్ రూరల్: బస్సు చార్జీలు ఎక్కువ తీసుకుంటున్నారని నర్సాపూర్ ఆర్టీసీ బస్టాండ్‌లో కంట్రోలర్‌తో ఆయా గ్రామాల ప్రయాణికులు బుధవారం రాత్రి గొడవకు దిగారు. ఓ వైపు మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం అంటూ ప్రచారం చేస్తూ మగవారికి మాత్రం బస్ చార్జీలను ఇష్టానుసారంగా పెంచి ఎక్కువగా తీసుకొని నష్టం కలిగిస్తున్నారని కంట్రోలర్‌తో ప్రయాణికులు గొడవ పడ్డారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తారని కంట్రోలర్ చెప్పడంతో వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు.